క్లుప్తంగా

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు



వాహనదారులను తనిఖీ చేస్తున్న ఎస్సై మాధవరావు

హనుమంతునిపాడు: మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎస్సై మాధవరావు హెచ్చరించారు. మండల పరిధిలోని కంభం–కనిగిరి రహదారిలో సోమవారం డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు నిర్వహించారు. ఈ సందర్భ,గా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపినా, మద్యం తాగి వాహనాలు నడిపినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోగులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న స్నేహ హస్తం సభ్యులు

కనిగిరిరూరల్: స్నేహ హస్తం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు సోమవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు డి.సుధీర్‌బాబు మాట్లాడుతూ రోగులకు, వారి బంధువులకు, అనాథలకు, నిరాశ్రయులకు, మతి స్థిమితం లేని వారికి, వృద్ధులకు భోజన వసతి కల్పించినట్లు తెలిపారు. స్నేహ హస్తం సభ్యులు శ్రీను, శివ శంకర్, గౌస్, మోహన్, కుమార్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీపీ గాయం సావిత్రి

హనుమంతునిపాడు: స్థానిక పీహెచ్‌సీ ఎంపీపీ గాయం సావిత్రి సోమవారం తనిఖీ నిర్వహించారు. ఈ రోగుల సెంటర్ల ఓపీల రికార్డులు. మందులు స్టాక్ రికార్డులు, సిబ్బంది నిర్వహణ రికార్డులు, ఆస్పత్రిలో ఉన్న బెడ్లు, వసతులు పరిశీలించారు. మందులు ఉన్నాయా లేవా అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. ఆస్పత్రిలోనే కాన్పులు నిర్వహించాలన్నారు. అనంతరం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులతో సమావేశాం ఏర్పాటు చేశారు. ఆస్పత్రి అభివృద్ధికి చేయాల్సిన పనులు సేవల గురించి వివరించారు. మెడికల్ ఆఫీసర్ దార్ల సందీప్, డాక్టర్ లక్ష్మీ భార్గవి, గ్రామ సర్పంచ్ కత్తిరాజారావు, మహమ్మందాపురం సర్పంచ్ పల్లపోలు రత్నలు, ఎంఎల్‌హెచ్‌పీ, నర్సులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్ గఫార్

కనిగిరిరూరల్: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో సోమవారం చైర్మన్ గఫార్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు నీరు, విద్యుత్, పారిశుధ్యం, మురికి నీటి కాలువల పరిశుభ్రత తదితర సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణ సమస్యల పరిష్కారంలో భాగంగా మున్సిపల్ సిబ్బందితో పారిశుధ్య చర్యలు చేయించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. పరిశుభ్రతతోనే వ్యాధులు దూరమవుతాయన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు



స్టాల్లో ఆహార ఉత్పత్తులు విక్రయిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కొండపి: ప్రకృతి వ్యవసాయంతో సాగుచేసిన పంటలకు మంచి డిమాండ్ ఉండి అధిక లాభాలు పొందవచ్చని యూనిట్ ఇన్‌చార్జిలు రంజిత్, మందాకిని, మాధవ అన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఇలవర, కట్టవారిపాలెం, పెరిదేపి, యూనిట్లలో ఏటీఎం మోడల్ ద్వారా పండించిన పంటలను విక్రయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంటలకు ప్రస్తుతం మార్కెట్లో ఎక్కువ డిమాండ్ ఉందన్నారు. ఐసీఆర్పీలు జోత్స్న, గౌతమి, విజయలక్ష్మి, ఏడుకొండలు, తిరుమల, మాలకొండయ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మహిళలు, రైతులు పాల్గొన్నారు.



అర్బన్ కాలనీలో రోడ్ల దుస్థితి



సూరపాపిరెడ్డి కాలనీలో ఇదీ దుస్థితి

సమీపంలోనే..సమస్యలతోనే..

- సమస్యలకు నిలయాలుగా శివారు కాలనీలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- సమస్యలతో సతమతమవుతున్న కాలనీ ప్రజలు

కనిగిరిరూరల్:

పట్టణానికి సమీపంలోనే ఉన్నాం.. కానీ.. సమస్యల్లోనే ఉన్నాం అంటూ కన్నీటి బాధను వ్యక్తం చేస్తున్నారు నాల్గు కాలనీల ప్రజలు. శరవేగంగా పెరుగుతున్న కనిగిరి పట్టణంలో అత్యంత త్వరగా రూపు దాల్చుకుని.. ఆవాస ప్రాంతాలుగా మారిన కాలనీలు ప్రధానంగా నాల్గు ఉన్నాయి. ఒకటి కనిగిరి కంభం రోడ్డులోని.. రోడ్డు పక్కనే సుమారు 300 నుంచి 400లకు పైగా గడపతో ఉన్న అర్బన్ కాలనీ(పాత, కొత్త, తోట కాలనీలు). ఇది పట్టణానికి సుమారు కిలోమీటర్ దూరంలో ఉంటుంది. ఇక కనిగిరి – పొదిలి రోడ్డులోని సూరపాపిరెడ్డి కాలనీలో సుమారు 150 నుంచి 200 గడపలు ఉన్నాయి. కనిగిరి పామూరు రోడ్డులోని దాదాపు పట్టణంలో కలిసి పోయినట్లు ఉండే అభయాంజనేయ స్వామి గుడి ఎదరు కాలనీ, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ సమీపంలో విశ్వ బ్రహ్మణ కాలనీ ఇవన్నీ కిలోమీటర్ నుంచి రెండు కిమీల దూరంలో ఉండే కాలనీలే.

అవస్థల్లో అర్బన్ కాలనీ..

పట్టణానికి కూతవేటు దూరంలో శరవేగంగా పెరిగిన పట్టణానికి అనుగుణంగా అత్యంత వేగంగా గృహ నిర్మాణాలు జరిగిన ప్రాంతం అర్బన్ కాలనీ. ఇక్కడ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీతో పాటు అన్ని సామాజిక వర్గాల ప్రజలు ఉన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఈ ప్రాంత అభివృద్ధిలో భాగంగా సుమారు రూ.3 కోట్లతో 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మించారు. కొన్ని వీధులకు రోడ్లు, సీసీ డ్రైన్లు వేశారు. అది మినహా ఏడాది నుంచి కనీస అభివృద్ధిలేదు. విద్యుత్ దీపాలు సక్రమంగా వెలగవు. పారిశుధ్యం అధ్వాన్నం. వర్షం పడితే నడక



అర్బన్ కాలనీలో అధ్వానంగా పారిశుధ్యం

నరకయాతనే. సీసీరోడ్డు, సీసీ డ్రైన్లు లేక, కనీసం కచ్చ కాలువలు తీయని పరిస్థితి. ఇళ్ల మధ్యలో చిల్ల చెట్లు పెరిగి విష పురుగులకు ఆవాస కేంద్రాలుగా మారాయి. ఇక రాత్రయితే వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను కాటేస్తుంటాయి.

సమస్యల్లో.. సూరాపాపిరెడ్డి కాలనీ..

దివ్యాంగుల కాలనీ, సూరపాపిరెడ్డి కాలనీ రెండు పక్క పక్కనే ఉంటాయి. ఇక్కడ సమస్యలు తాండవిస్తున్నాయి. కాలనీల్లో స్తంభాలకు వీధిలైట్లు లేక, ఉన్న చోట్ల వీధి దీపాలు వెలగక పాలకుల తీరును వెక్కిరిస్తున్నాయి. నీటి సమస్య తీవ్రంగా ఉంది. తాడు, వాడుక నీటికి ప్రజలు అల్లాడుతున్నారు. అంతర్గత రోడ్లు అధ్వాన్నం. సీసీ రోడ్లు, డ్రైన్లు మచ్చుకకు కూడా కానరావు.

ఇక కనిగిరి నుంచి పామూరు రోడ్డులో అభయాంజనేయ స్వామి గుడి ఎదురుగా ఉన్న హైవే రోడ్డుకు అనుకున్న కొత్త కాలనీలో కనీస సౌకర్యాలు మృగ్యం. చినుకుపడితే రోడ్లు చిత్తడి మయం. వీధి లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో పట్టణానికి సమీపంలో ఉన్నా సమస్యలతో అల్లాడుతున్నారు. డిగ్రీ కాలేజీ సమీపంలో ఉన్న విశ్వబ్రహ్మణ కాలనీ వాసులు సమస్యలతో సతమవుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పారిశుధ్యం, వీధి దీపాల సమస్య, చిల్లచెట్లతో రోడ్లు మూసుకుని పోయి చిత్తడి మయంగా మారడంతో ప్రజలు పడే అవస్థలు వర్ణణాతీతం. ఆయా కాలనీల్లోని గృహాలకు ముక్కు పిండి పన్నులు వసూలు చేసే అధికారులు కనీస మౌలిక వసతులు కల్పించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు అధికారుల వైఖరిపై తీవ్రంగా మండిపడుతున్నారు.



సూరపాపిరెడ్డి కాలనీలో వీధి లైట్లు లేని విద్యుత్ స్తంభం

ప్రచార ఆర్భాటం..ఆచరణ శూన్యం



ఆర్టీసీ డిపోలో బస్సులు లేక పోవడంతో నిరీక్షిస్తున్న మహిళలు, ప్రయాణికులు



గార్లపేట రూట్‌లో వచ్చిన ఉచిత బస్సు వద్ద విద్యార్థినులు, మహిళలు, ప్రయాణికుల తోపులాట

- ఉచిత బస్సు అమల్లో ఎన్నో కష్టాలు
- బస్సులు లేక గంటల తరబడి మహిళల ఎదురుచూపులు

కనిగిరిరూరల్: కూటమి ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన స్త్రీ శక్తి పథకం(ఉచిత బస్సు) పథకం క్షేత్ర స్థాయిలో పురిటినొప్పులు పడుతోంది. రాష్ట్రంలో ఎక్కడి నుంచి అయినా ఎక్కెడికైనా మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని ప్రచారాం హోరెత్తించారు. కానీ అమలులో షరతులు, నిబంధనలు పెట్టి మహిళలకు కొత్త కష్టాలు తెచ్చి పెట్టారు. మహిళలకు సరిపడ బస్సులు కేటాయించకపోవడంతో ప్రయాణికులు పడే అవస్థలు వర్ణణాతీతంగా మారాయి. సోమవారం కనిగిరి ఆర్టీసీ డిపోను, పట్టణంలోని ప్రధాన బస్ పాయింట్లను సాక్షి విజిట్ చేయగా అనేక దృశ్యాలు కన్పించాయి. కనిగిరి డిపోలో సుమారు 10 గంటల నుంచి 11 గంటల వరకు సక్రమంగా పాయింట్లలో ఉచిత బస్సు సర్వీసులు లేకపోవడంతో అత్యవసర పనులకు వెళ్లే మహిళలు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఉచిత బస్సు కోసం మాత్రమే వచ్చిన అనేక మంది మహిళలు డిపోలో పాయింట్ల వద్ద పడిగాపులు గాయాల్సి వచ్చింది. ఒక వేళ బస్సు వచ్చిన ఎక్కువ మంది ఎక్కుతుండటంతో ప్రయాణం నరక యాతనగా మారిందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గార్లపేట రోడ్డులో ఉదయం 8 గంటలకు గుడిపాడు, కొత్తపాలెం వెళ్లే బస్సుకు ఉపాధ్యాయులు, విద్యార్థినులు, మహిళలు, ప్రయాణికులు అందరికి ఒకే బస్సు కావడంతో బస్సు సరిపోక తోపులాడుకుంటూ కన్పించారు. కనిగిరి డిపోలో 113 బస్సులు ఉండగా, 91 ఆర్టీసీ, హైయ్యర్ బస్సులు 22 వరకు ఉన్నాయి. వాటిలో సుమారు 47 నుంచి 55 వరకు ఉచిత పల్లెవెలుగు, పల్లె వెలుగు ఎక్స్‌ప్రెస్ బస్సులను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. గత రెండు రోజుల నుంచి పండుగలతో మహిళలు, మహిళా ఉద్యోగులు, ఇతర ప్రయాణికులు బయటకు రాలేదు. సోమవారం కావడంతో మహిళలు, మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు, ప్రయాణికులు అంతా డిపోలకు రావడంతో వారి సరిపడ బస్సులు ఏర్పాటు చేయక పోవడంతో మహిళలు అనేక ఇక్కట్లు పడ్డారు. రద్దీ బస్సుల్లో, ఇరుకులో ఇక్కట్లు పడలేక చాలా మంది నగదు చెల్లించి టిక్కెట్ తీసుకునే బస్సుల్లో ప్రయాణించినట్లు తెలిపారు.

ఆ గ్రామాలకు బస్సులు ఏవీ..

ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్సులు కొన్ని గ్రామాలకు వెళ్లడం లేదు. ఆర్టీసీ అధికారులు మాత్రం ఒంగోలు, పొదిలి వైపు రెగ్యులర్‌గా నడిపే కొన్ని రూట్‌ల బస్సులను ఆపి గ్రామాలకు తిప్పుతున్నట్లు చెప్తున్నా.. గ్రామాల ప్రజలు మాత్రం వారి గ్రామాలకు బస్సులు లేక ఆటోల్లో వచ్చి కనిగిరి డిపోలో నేరుగా దిగుతున్నారు. కనిగిరి నియోజకవర్గంలో 135 పంచాయతీలు, 234 ఆవాస గ్రామాలున్నాయి. కనిగిరి మండలంలో 25 పంచాయతీలు 96 అవాస గ్రామాలున్నాయి. నియోజకవర్గంలో దాదాపు 50 గ్రామాలకు బస్సులు వెళ్లలేని పరిస్థితి ఉందంటే అతిశయోక్తి కాదు.



గ్రామాలకు ఉచిత బస్సు రాకపోవడంతో ఆటోలో వచ్చి డిపోలో దిగుతున్న మహిళలు, విద్యార్థినులు

అక్రమ అరెస్టులకు భయపడం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా నాయకులు హనీఫ్

పామూరు: అక్రమ అరెస్టులకు కమ్యూనిస్టులు భయపడరని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ హనీఫ్ అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ నెల్లూరు జిల్లా కరేడులో భూసేకరణకు వ్యతిరేకంగా ఛలో కరేడు కార్యక్రమానికి హాజరవుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావును, నాయకులను కరేడు క్యాంపు వద్ద అక్రమంగా పోలీసులు అరెస్ట్ చేయడం తగదన్నారు. ఇండోసోల్ కంపెనీకి వ్యవసాయ భూమిని ఇవ్వడం సరైనది కాదన్నారు. పేదలు నమ్ముకుని జీవిస్తున్న వ్యవసాయ భూమిని దౌర్జన్యంగా కంపెనీలకు కూటమి ప్రభుత్వం ఇవ్వడం సరైనది కాదన్నారు. రైతులవద్ద దౌర్జన్యంగా భూములు లాక్కుంటే కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. మండల కార్యదర్శి ఖాదర్‌బాషా, వెంకటేవ్వర్లు, బి.నాగేశ్వరరావు, సయ్యద్‌గౌస్‌బాషా పలువురు పాల్గొన్నారు.

మహాసభల జయప్రదం కోరుతూ బైక్ ర్యాలీ



మాట్లాడుతున్న జీపీ రామారావు



సీపీఐ శ్రేణుల బైక్ ర్యాలీ

కనిగిరిరూరల్: సీపీఐ 28వ రాష్ట్ర మహాసభల జయప్రదం కోరుతూ పార్టీ శ్రేణులు సోమవారం కనిగిరిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జీపీ రామారావు మాట్లాడుతూ 100 ఏళ్ల చరిత్ర కల్గిన అఖిల భారత కమ్యునిస్టు పార్టీ ఒంగోలు వేదికగా తొలిసారి ఈ నెల 20 నుంచి 25 వరకు రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 23న ఒంగోలులో భారీ ప్రదర్శన, ర్యాలీ జరుగుతుందన్నారు. మహాసభలకు నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు, రైతు, కూలీ, కార్మిక, కర్షకులు, విద్యార్థి, యువత అందరూ అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిరంకుశ వైఖరిపై, ప్రజా వ్యతిరేక చర్యలకు సీపీఐ చేసే ఉద్యమాల్లో అన్ని వర్గాల ప్రజలు భాగస్వామ్యులు కావాలన్నారు. తొలుత స్థానిక దరిశి చెంచయ్య భవన్ వద్ద నుంచి పట్టణ పుర వీధుల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. సీపీఐ, వివిధ సంఘాల నాయకులు పందిటి మోహన్, ఎస్‌కే గులాం హుస్సేన్, గుజ్జుల బాలిరెడ్డి, ఎస్‌కే ఖాశింపీరా, మాచేపల్లి పూర్ణ చంద్రారావు, పుట్టా సుబ్బారావు, సీహెచ్ పవన్ కళ్యాణ్, తాహీద్, ఇఫ్రాజ్, కోటయ్య, నాసర్, ఖాదర్‌వలి, అశోక్, కోటయ్య, పాల్గొన్నారు.

రోజు రోజుకీ తగ్గుతున్న సరాసరి ధరలు



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు



కొండపిలో వేలం

టంగుటూరు: రోజు రోజుకి తగ్గుతున్న పొగాకు సరాసరి ధరలు చూసి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో పొగాకు సరాసరి రూ.210.08గా నమోదైంది. వేలం కేంద్రానికి కారుమంచి గ్రామానికి చెందిన రైతులు వేలానికి 1022 బేళ్లను తీసుకురాగా వాటిలో 869 కొనుగోలు చేసి 153 పొగాకు బేళ్లు తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.281, కనిష్ఠ ధరరూ.140, సరాసరి ధర రూ.210.08 పలికింది. వేలంలో 40 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం నిర్వహించిన వేలంలో పొగాకు సరాసరి ధర.247.35 పలికిందని వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు.క్లస్టర్ పరిధిలోని చౌటపాలెం, రామాయపాలలెం, కొండపి, పోలిరెడ్డిపాలెం, దాదానాయుడుపాలెం, దాసిరెడ్డిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1024 బేళ్లను తీసుకురాగా 843 బేళ్లను కొనుగోలు చేసి 181 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.281, కనిష్ఠ ధర రూ.140గా నమోదైంది. వేలంలో 25 కంపెనీలు పాల్గొన్నాయి.

అక్రమ అరెస్టు అన్యాయం



టంగుటూరులో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

టంగుటూరు: ఛలో కరేడు పిలుపునిచ్చిన నేతలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ స్థానిక బొమ్మల సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అరెస్టు చేసిన నాయకులు, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం బలవంతంగా భూ సేకరణకు పూనుకుంటే ప్రాణ త్యాగానికైనా సిద్ధపడతామని కరేడు గ్రామస్తులు తేల్చి చెప్పారన్నారు. సీపీఎం నాయకులు టి.రాము, వి. మోజెస్, టి.పాపారావు, కూతల ప్రసాద్, టి.నారాయణరావు, టి.రామ్మూర్తి, జి.కాశీవిశ్వనాథ్, ఎస్‌కే శ్రీనివాసరావు, తిరుమలరావు, హేతువాదసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం కాలేషా బేగ్, న్యూ డెమోక్రసి జిల్లా నాయకులు టి.వెంకటరావు, సీపీఐ మండల కార్యదర్శి టి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ట



బాపట్ల కలెక్టర్ వెంకట మురళిని సన్మానించి ప్రసాదం, స్వామి చిత్రపటం అందజేస్తున్న కమిటీ

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని పెదరాజుపాలెం ఎగువపల్లెలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో సీతా, రామ, లక్ష్మణ, హనుమంత విగ్రహ మూర్తుల ప్రతిష్టా మహోత్సవం సోమవారం అర్చకుల వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. ప్రతిష్టా మహోత్సవ అనంతరం ఉత్సవమూర్తులకు శాంతి కల్యాణం నిర్వహించారు. ప్రతిష్టా మహోత్సవంలో బాపట్ల కలెక్టర్ జె.వెంకటమురళి పాల్గొనగా ఆయన చేత అర్చకులు విశిష్ట పూజలు చేయించారు.

నేటి నుంచి సీతారామ స్వామి విగ్రహ ప్రతిష్ట



చిన్నవరిమడుగులో నూతనంగా నిర్మించిన రామాలయం

వీసీపల్లి: మండల పరిధిలోనే చిన్న వరిమడుగులో సీతారామ స్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతిష్ట కార్యక్రమాన్ని గుట్టపల్లి సుధాకర్ శర్మ, శ్రీనివాసమూర్తి, రమేష్ పంతులు ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ



తీవ్రంగా గాయపడిన తూపిలి కొండయ్య

ఉలవపాడు: రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన జాతీయరహదారిపై ఉలవపాడు దక్షిణ బైపాస్ వద్ద సోమవారం జరిగింది. వివరాలు.. చాకిచర్ల పెదపట్టపుపాలేనికి చెందిన తూపిలి కొండయ్య తన ద్విచక్రవాహనం పై సింగరాయకొండ నుండి పెదపట్టపుపాలెంకు వెళుతున్నాడు. ఇదే సమయంలో కరేడు ర్యాంపు నుంచి బందోబస్తు చేసి ఇద్దరు పోలీసులు మరో ద్విచక్రవాహనం పై వెళుతున్నారు. ఒకే వైపుకు వెళుతున్న రెండు ద్విచక్ర వాహనాలు ప్రమాదవశాత్తు ఢీ కొన్నాయి. తూపిలి కొండయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. మరో వాహనం పై వెళుతున్న పోలీసులకు గాయాలు కాకపోవడంతో వారు వెళ్లిపోయారు. క్షతగాత్రుని 108 సిబ్బంది ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ శాఖాధికారులు

పామూరు: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే వారిపై కఠిన చర్యలు చేపడతామని విద్యుత్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఈఈ డీపీ హైమావతి, ఆపరేషన్స్ ఈఈ ఉమాకాంత్ అన్నారు. మండలంలో పలుగ్రామాల్లో సోమవారం విద్యుత్‌శాఖాధికారులు 29 బృందాలుగా ఏర్పడి 993 సర్వీసులను ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న పలు సర్వీసులను గుర్తించి వారికి రూ.2.50 లక్షల జరిమానా విధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ విద్యుత్ వినియోగిస్తే అపరాధ రుసుం కాకుండా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈ కృష్ణారెడ్డి, ఏఈ పామూరు జిలాని పలు మండలాల ఏఈలు అధికారులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

పామూరు: వినాయక చవితి విగ్రహాల ఏర్పాటుకు విధిగా సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ ఎం భీమానాయక్ అన్నారు. వినాయక చవితి విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు, వేడుకల నిర్వహణ, జాగ్రత్తలపై సోమవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో సీఐ భీమానాయక్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా పామూరుతో పాటు మండలంలోని ఏ గ్రామంలోనైనా విగ్రహాలు ఏర్పాటు చేయాలంటే ముందస్తుగా చలానా కట్టి అనుమతులు తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కమిటీలుగా ఏర్పడి అనుమతులు పొంది విగ్రహ ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు కమిటీ బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు. వినాయకచవితి వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. ఎస్సై టి.కిషోర్‌బాబు ఉన్నారు.

గణేష్ ఉత్సవాల్లో పోలీస్ నిబంధనలు పాటించాలి

కనిగిరిరూరల్: గణేష్ నవరాత్రుల ఉత్సవాల్లో పోలీస్ నిబంధనలు, సూచనలు పాటించి పండుగను శాంతియుతంగా, ప్రశాంతంగా, సంతోషంగా, అందరి సహకారంతో జరుపుకోవాలని డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ అన్నారు. గణేష్ మండపాలు ఏర్పాటుచేసుకునే వారు ముందుగా పోలీస్ శాఖ అనుమతి పొందాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా మండపాలు ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జన సమయంలో క్రమశిక్షణ పాటించి, పోలీసుల సూచించిన మార్గాలనే ఉపయోగించాలని సూచించారు. పోలీసుల సూచనలు పాటిస్తే పండుగను శాంతియుతంగా, భక్తిపారవశ్యంతో నిర్వహించుకోవాలన్నారు.